క్లుప్తంగా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చేందుకు కృషి



నెల్లూరు(మినీబైపాస్): జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను సాధించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఏపీయుడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మస్తాన్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడారు. అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న ఇద్దరు జర్నలిస్టులకు రూ.రెండు లక్షల చొప్పున అందజేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. వెంకటాచలం మండలంలో ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ఈ మేరకు జాబితాను రూపొందించాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. నాగరాజ్, రవి, వెంకటేశ్వర్లు, నయీమ్‌ఖాన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లోనే రుణాల మంజూరు



మాట్లాడుతున్న శంకర్‌బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని రైతులు, ఖాతాదారులు, సొసైటీ సభ్యుల సౌలభ్యం కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనే అన్ని రకాల రుణాలను అందజేయనున్నామని డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు పేర్కొన్నారు. పెద్దచెరుకూరు పీఏసీఎస్‌లో రుణాలను అందజేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డ్, ఆప్కాబ్ సహకారంతో పీఏసీఎస్‌లో స్వల్పకాలిక, దీర్ఘకాలిక, స్థిరాస్తులు, బంగారు ఆభరణాల తనఖాలపై రుణాలను అందజేయనున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ చైర్మన్ మనుబోలు రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ జీఎం ఉషారాణి, రామ్మూర్తినగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, ఫీల్డ్ ఆఫీసర్ బాబు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

వెంకటాచలం : ఆరోగ్యంపై ఎవరూ అశ్రద్ధ చూపొద్దని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విజయ డయాగ్నోస్టిక్స్ సెంటర్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆహారపు అలవాట్లు, పనిఒత్తిడితో చాలా మంది ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకుని కొద్దిపాటి వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఉదయ్‌శంకర్, సునీత, విద్యా ప్రభాకర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయండి

ముత్తుకూరు : కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్ పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పోర్టు ఆవరణలో శనివారం మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఓజోన్ పొర పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. భూమి మీద జీవన విధానం బాగుండాలంటే ఓజోన్ పొర దెబ్బతినకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో భాగంగానే విధిగా మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. అనంతరం పోర్టు ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ జీఎం మనోహర్‌బాబు, రమేష్‌బాబు, వేణుగోపాల్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సాగర్‌పై అవగాహన

ఇందుకూరుపేట : అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మైపాడు తీరంలో స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్‌పై మత్స్యకారులకు శనివారం అవగాహన కల్పించారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో తీరప్రాంతాన్ని కాలుష్య రహితంగా కాపాడుకోవడం, పరిశుభ్రమైన తీరంగా తీర్చిదిద్దుకోవడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశించారు. నగరంలో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్న రంగనాయకులపేట, పెన్నా బ్యారేజీని అధికారులతో కలిసి శనివారం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పెన్నా బ్యారేజీ పనుల నేపథ్యంలో ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో గల ఘాట్ వద్ద నిమజ్జన కార్యక్రమాలను గతేడాది నిర్వహించారని చెప్పారు. ఈ ఏడాది ఆ ప్రాంతంతో పాటు రంగనాయకులపేట వద్ద ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నారని వివరించారు. పెన్నా బ్యారేజీ వద్ద మూడు క్రేన్లను ఏర్పాటు చేసి రోడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ప్రధాన దేవాలయాల వద్ద ప్రసాదాలను అందించేలా కౌంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు అస్మ, గుంజి జయలక్ష్మి, వేలూరు మహేష్, పొట్లూరి రామకృష్ణ ఆచారి, ఓబిలి రవిచంద్ర, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



పెన్నా బ్యారేజీ వద్ద నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

పోలీసుల అనుమతులు తప్పనిసరి

• నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



నెల్లూరు(క్రైమ్): వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో సాక్షితో ఆయన మాట్లాడారు. ఉత్సవ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్లో దరఖాస్తులను సమర్పించాక, వాటిని పూర్తిగా పరిశీలించిన అనంతరమే అనుమతులను మంజూరు చేయనున్నామని వివరించారు. మండపాల ఏర్పాటుకు స్థల యజమానులు, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు ఉండాలని, వీటిని దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలు, భద్రత చర్యలను పాటించాలని ఆదేశించారు. బలవంతపు వసూళ్లు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

ఇవీ నిబంధనలు..

- ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకొని వివరాలను పోలీసులకు అందజేయాలి
- విగ్రహ ఎత్తు, బరువు, విగ్రహాన్ని నిలిపే స్థలం, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, మార్గం, వినియోగించే వాహనాల వివరాలను తెలియజేయాలి
- మండపాల వద్ద నిబంధనల మేరకే లౌడ్ స్పీకర్లను వినియోగించాలి. ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకే వీటికి అనుమతి
- మండపాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి. విద్యుత్ తీగలు, ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రత్తలు వహించాలి. షార్ట్ సర్క్యూట్ జరగకుండా వైరింగ్‌ను జాగ్రత్తగా చేయించుకోవాలి. అగ్నిమాపక సామగ్రి, నీరు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- భద్రత కోసం మండపాల వద్ద రాత్రి వేళ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలి. సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలి. అనుమానిత వ్యక్తులు, ఎవరైనా వస్తువులను వదిలివెళ్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి.
- పూజా సమయంలో మండపంపై ఎక్కువ మంది భక్తుల్లేకుండా చూసుకోవాలి. పందిళ్లకు చుట్టుపక్కల ప్రాంతాల్లో వాహనాలను నిలపకూడదు.
- నిమజ్జన ఊరేగింపునకు అనుమతించిన మార్గం, సమయంలోనే వెళ్లాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలి
- ఊరేగింపు సమయంలో అశ్లీల నృత్యాలు, బాణసంచా నిషేధం
- నిర్దేశిత సమయంలో నిర్దేశిత ప్రాంతంలోనే నిమజ్జనం చేయాలి.

కొనసాగుతున్న పౌష్టికాహార మాసోత్సవాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీఓ అన్నపూర్ణ పేర్కొన్నారు. రంగనాయకులపేటలోని కామాక్షినగర్, బాలాజీనగర్ సెక్టార్ పరిధిలోని కృషినగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ బాలామృతాన్ని అందజేశారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, కనకరత్నం, శారద, షాహిన తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: కొత్త వెల్లంటిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో ఎంపికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో జూనియర్ బాలబాలికలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం ఎంపిక చేయనున్నామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల లిస్ట్, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని కోరారు. ఎంపికైన వారు ఏలూరులో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు. వివరాలకు 94418 75190, 89194 77693 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'జెనెక్స్'లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వినోద్

నెల్లూరు(టౌన్): హరనాథపురంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రైల్వే న్యాయమూర్తి వినోద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కొండలరావు, న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, వెంకయ్య, కామేశ్వరి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళా కార్మిక సంఘాల ఏర్పాటు



మాట్లాడుతున్న శ్రీనివాస చక్రవర్తి

నెల్లూరు(మినీబైపాస్): కళాసేవ చేయాలనే ఆశయంతో కళాంజలి 55 కళా కార్మిక సంఘాలను ఏర్పాటు చేశామని కళాంజలి శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. శ్రీనివాస్, శ్రుతి కృష్ణమోహన్‌యాదవ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వృద్ధుడు (60) మృతి చెందిన ఘటన మైపాడు గేట్ సెంటర్ సమీపంలోని కేవీఆర్ కల్యాణ మండప ఎదురుగా గల రోడ్డుపై చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు 4 / 3వ వార్డు రెవెన్యూ సెక్రటరీ అరుణకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నవాబుపేట పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ బాబీ కోరారు.

వార్డు సచివాలయాల్లో తనిఖీలు



నెల్లూరు సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. 42, 48వ డివిజన్లలోని వార్డు సచివాలయాలను ఆకస్మికంగా శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయాల్లో ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని.. ఎస్డీజీ, భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

సింగిల్ విండో అనుమతులకు అర్జీల స్వీకరణ



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన మండపాల నిర్వాహకుల నుంచి సింగిల్ విండో అనుమతులకు అర్జీలను స్వీకరిస్తున్నామని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు పేర్కొన్నారు. టీవీఎస్ కల్యాణ సదన్‌లో సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఉత్సవ నిర్వాహకుల నుంచి అర్జీలను శనివారం స్వీకరించారు. సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, మోహన్‌రావు, హర్షవర్ధన్, భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న డీఈఓ గంగాభవానీ, తదితరులు

నెల్లూరు(సెంట్రల్): వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని, దీని ద్వారా పర్యావరణానికి మేలు అని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. ఫతేఖాన్‌పేటలోని రైతుబజార్ ప్రాంతంలో మట్టి ప్రతిమలను పొల్యూషన్ కంట్రోల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. అనంతరం మట్టి వినాయక ప్రతిమలతో కలిగే లాభాలపై కళాజాత బృంద ప్రదర్శన ఆకట్టుకుంది. పొల్యూషన్ కంట్రోల్ ఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఈఓ గంగాభవానీ పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని బంకమట్టి గణనాథుడి ప్రతిమలను నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. గాంధీబొమ్మ సమీపంలోని వెంకట్రామా షాపీలో శ్రీశ్రీ ఏజెన్సీస్, వెంకట్రామా షాపీ, ఏపీ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. కేంద్ర సమాచార శాఖ అధికారి పరవస్తు నాగసాయిసూరి, సింహపురి వైద్యశాల ట్రస్టీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, యూనియన్ బ్యాంక్ నెల్లూరు శాఖ మేనేజర్ మనోజ్‌కుమార్, నిర్వాహకుడు శ్రీపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బీవీనగర్‌లో..



పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో..

నెల్లూరు(టౌన్): మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి పేర్కొన్నారు. బీవీనగర్‌లోని కేబీఆర్ పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులతో తయారు చేయించారు. అనంతరం బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

30న ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 30న నిర్వహించనున్నారని ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత రాష్ట్ర కార్యవర్గ పదవీ కాలం వచ్చే నెల రెండున ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిందని చెప్పారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారని వివరించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులతో పాటు 30 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందని, ఎన్నికల ప్రక్రియ విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

పలువురి బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పలు మండలాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువుర్ని బదిలీ చేశారని కలెక్టర్ కార్యాలయాధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దగదర్తి తహసీల్దార్‌గా కృష్ణప్రసాద్, దుత్తలూరు తహసీల్దార్‌గా నిరంజన్, మనుబోలు సీఎస్డీటీగా లక్ష్మీప్రసన్న, వింజమూరు సీఎస్డీటీగా బాలాజీసింగ్, ఉదయగిరి ఎలక్షన్ డీటీగా సుభాషిణి, పెళ్లకూరు రీసర్వే డీటీగా మునికిరణ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): నగరంలో 43 మంది టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి ఖాదర్‌వలీ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. టీబీ రోగులు మందులతో పాటు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



నెల్లూరు(టౌన్): ఓజోన్ పరిరక్షణపై కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శనివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

3న దేశవ్యాప్తంగా బ్లాక్ డే



మాట్లాడుతున్న హేమలత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలోని రైతులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టనున్నామని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్ఐ) జాతీయ అధ్యక్షురాలు హేమలత పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సీడబ్ల్యూఎఫ్ఐ వర్కింగ్ కమిటీ సమావేశాల్లో శనివారం ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ మూడున బ్లాక్ డేను నిర్వహించనున్నామని చెప్పారు. భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు, జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, సీఐటీయూ జిల్లా నేత పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు నేడు

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలను ఆదివారం నిర్వహించనున్నామని పార్టీ నేతలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పప్పులవీధి నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీని కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని చెప్పారు. విశ్వకర్మ కౌసల్య యోజన ప్రారంభాన్ని పురస్కరించుకొని ప్రధాని చేపట్టనున్న కార్యక్రమాన్ని కుక్కలగుంట కూడలిలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించనున్నామన్నారు.

రూరల్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ తహసీల్దార్‌గా సోమ్లానాయక్ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

శ్మశాన సమస్య పరిష్కారానికి వినతి

నెల్లూరు(దర్గామిట్ట): అనంతసాగరంలోని ముస్లిం శ్మశాన వాటిక హద్దు రాళ్ల విషయమై ఏర్పడిన సమస్యను పరిష్కరించాలని సీపీఎం నేతలు చంద్రా రాజగోపాల్, గంటా లక్ష్మి, పుల్లయ్య కోరారు. ఈ మేరకు జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని శనివారం సమర్పించారు.

వెల్లంటిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని వెల్లంటిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శనివారం ప్రారంభించారు. ఆరోగ్య సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

గణనాథుడికి ప్రణమిల్లి..



నెల్లూరు(బృందావనం): వినాయక చవితిని పురస్కరించుకొని పొగతోటలోని కస్తూరిదేవినగర్‌కు చెందిన కళాకారుడు తిరుమలశెట్టి చంద్ర పలు ఔషధాల చూర్ణంతో కాణిపాక గణపతి రూపాన్ని తీర్చిదిద్దారు. పేపర్ గుజ్జు, పటిక పొడి, మంజిష్ట మూలిక తదితర ఔషధ గుణాలు కలిగిన చూర్ణంతో అడుగు ఎత్తు, అడుగు వెడల్పుతో కాణిపాక గణపతికి రూపమిచ్చానని చెప్పారు.